సాక్షి కామారెడ్డి

ఆదివారం । 30 । జూన్ । 2024



నేడు నిజామాబాద్‌కు సీఎం

ఖలీల్‌వాడి: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం నిజామాబాద్ జిల్లాకు రానున్నారు. మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్‌రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొంటారు. ఉదయం 10.30 గంటల వరకు నిజామాబాద్‌లోని కొత్త కలెక్టరేట్‌లోని హెలీప్యాడ్‌లో సీఎం దిగుతారు. అక్కడి నుంచి కారులో రోడ్డు మార్గాన డీఎస్ ఇంటికి చేరుకుని పార్థీవదేహానికి నివాళులర్పిస్తారు. అనంతరం డి.శ్రీనివాస్ అంతిమయాత్రలో పాల్గొంటారు. వర్షం కురిసే అవకాశం ఉండడంతో సీఎం షెడ్యూల్‌లో మార్పుచేర్పులు ఉంటాయని అధికార వర్గాల ద్వారా తెలిసింది. భారీగా వర్షం కురిస్తే రోడ్డు మార్గంలో వచ్చే అవకాశం ఉంది. సీఎం రానున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

గురువు ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి..

- వివరాలు 8లో..

ప్రముఖుల నివాళులు

- వివరాలు 10లో..

ఒరిగిన శిఖరం

ఇందూరు రాజకీయాలపై చెరగని ముద్ర వేసిన శీనన్న



ఉమ్మడి ఇందూరు జిల్లా రాజకీయాల్లో ఓ శిఖరం ఒరిగింది. బలహీనవర్గాల నేతగా రాష్ట్ర రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన ఇందూరు ముద్దుబిడ్డ ధర్మపురి శ్రీనివాస్.. తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయారు. ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్తగా ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన.. మాజీ మంత్రి అర్గుల్ రాజారాం వద్ద రాజకీయ ఓనమాలు నేర్చుకుని అంచలంచెలుగా ఎదిగారు. మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా సేవలందించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్‌తో కలిసి ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ రెండుసార్లు అధికారంలోకి రావడంలో కీలక భూమిక పోషించారు. సమకాలికులు డీఎస్‌గా, అభిమానులు శీనన్నగా పిలిచే ధర్మపురి శ్రీనివాస్ నిష్క్రమణం జిల్లాకు తీరని లోటని రాజకీయ నాయకులు పేర్కొంటున్నారు.

గుండెపోటుతో ధర్మపురి శ్రీనివాస్ మృతి

- ఎన్‌ఎస్‌యూఐ నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన శ్రీనివాస్
- ఇందిరమ్మ పిలుపుతో బ్యాంకు ఉద్యోగానికి రాజీనామా చేసి క్రియాశీల రాజకీయాల్లోకి..
- ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర
- జిల్లా అభివృద్ధిలోనూ తన మార్క్ చూపించిన డీఎస్
- రెండుసార్లు పీసీసీ అధ్యక్షుడిగా పార్టీ గెలుపులో కీలక పాత్ర
- కష్టకాలంలో పార్టీని ఉన్నత స్థానానికి తీసుకొచ్చిన వైఎస్, డీఎస్
- వైఎస్ మృతి తరువాత ముఖ్యమంత్రి పదవి అందినట్టే అంది చేజారింది
- అభిమాన నేత మృతితో జిల్లాలో విషాద వాతావరణం



డి శ్రీనివాస్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్, చిత్రంలో డీఎస్ తనయులు ఎంపీ అర్వింద్, మాజీ మేయర్ సంజయ్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఉమ్మడి ఇందూరు జిల్లా రాజకీయాల్లో డీఎస్ శకం ముగిసింది. ఉమ్మడి ఏపీలో పార్టీకి విజయవంతమైన పీసీసీ అధ్యక్షుడిగా గుర్తింపు తెచ్చుకున్న ధర్మపురి శ్రీనివాస్, అందరూ అభిమానంతో పిలుచుకునే డీఎస్ (75) ఇక లేరు. శనివారం తెల్లవారు జామున హైదరాబాద్‌లోని తన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. పీసీసీ అధ్యక్షుడిగా డీఎస్ ఉమ్మడి రాష్ట్రంలో పార్టీకి గొప్ప సేవలందించారు.

2004, 2009లో డీఎస్ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో పార్టీ శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వైఎస్, డీఎస్ ఇద్దరూ జోడెద్దులుగా పార్టీని విజయపథాన తీసుకెళ్లారనే గుర్తింపు ఉమ్మడి రాష్ట్రంలో ఉంది. 2009లో వైఎస్‌ఆర్ మృతి తరువాత ముఖ్యమంత్రి పదవికి అవకాశం వచ్చినప్పటికీ ఆ సమయంలో శాసనసభ సభ్యుడిగా లేకపోవడంతో ఆ అవకాశాన్ని కోల్పోయారు. ఇక ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రాజకీయాల్లో తనదైన తిరుగులేని ముద్ర వేసుకున్నారు. తన శిష్యులుగా రాజకీయాల్లోకి వచ్చిన అనేక మంది నాయకులు నేడు రాజకీయంగా మంచి స్థానాల్లో రాణిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రతి మండలంలో డీఎస్ శిష్యులు ఉండడం గమనార్హం. అదేవిధంగా అభివృద్ధి విషయంలోనూ డీఎస్ తన ప్రత్యేకత చూపించుకున్నారు. అభిమాన నేత డీఎస్ మృతితో జిల్లావ్యాప్తంగా గంభీర వాతావరణం నెలకొంది. డీఎస్ అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

- 1948 సెప్టెంబర్ 27న జిల్లాలోని వేల్పూర్‌లో జన్మించిన డీఎస్ హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో డిగ్రీ, ఎల్‌ఎల్‌బీ చదివారు. నిజాం కళాశాలలో చదివేటప్పుడే ఎన్‌ఎస్‌యూఐ విద్యార్థి సంఘంలో క్రియాశీల పాత్ర పోషించారు. తరువాత కాలంలో ఎస్‌బీఐలో ఉద్యోగం వచ్చింది. ఈ సమయంలో ఇందిరాగాంధీ పిలుపు మేరకు ఉద్యోగాన్ని వదులుకుని క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారు. అర్గుల్ రాజారాం శిష్యుడిగా ఉన్న డీఎస్ అనంతరం ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించారు. తరువాత కాలంలో 1989లో నిజామాబాద్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1999, 2004 లోనూ డీఎస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కేబినెట్‌లలో మంత్రిగా పనిచేశారు. 2004, 2009లో డీఎస్ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీ విజయాలు నమోదు చేసింది. సోనియాకు అత్యంత సన్నిహితుడిగా ఉన్న డీఎస్ అపాయింట్‌మెంట్ లేకుండానే కలిసేవారు.
- 2013 నుంచి 2015 వరకు ఎమ్మెల్సీగా వ్యవహరించిన డీఎస్ తెలంగాణ ఏర్పాటు తరువాత మరోసారి ఎమ్మెల్సీ దక్కకపోవడంతో కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. 2015లో బీఆర్‌ఎస్‌లో చేరారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడుగా పనిచేశారు. 2016 నుంచి 2022 వరకు బీఆర్‌ఎస్ తరుపున రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు. తరువాత 2023లో తన పెద్ద కుమారుడు సంజయ్‌తో కలిసి తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. సంజయ్ నిజామాబాద్ మొదటి మేయర్‌గా పనిచేశారు. చిన్న కుమారుడు అర్వింద్ బీజేపీలో చేరి 2019, 2024లో వరుసగా రెండుసార్లు ఎంపీగా గెలుపొందారు.

అభివృద్ధి పనులు..

అభివృద్ధి పనుల విషయంలోనూ ధర్మపురి శ్రీనివాస్ తన ప్రత్యేకతను చాటుకున్నారు. తెలంగాణ విశ్వవిద్యాలయం ఏర్పాటు, నాగారంలో అర్గుల్ రాజారాం స్టేడియం, బొడ్డెమ్మ చెరువు అభివృద్ధి, అలీసాగర్ నుంచి నిజామాబాద్‌కు తాగునీరు. కంఠేశ్వర్ బైపాస్, డీఎస్ కూరగాయల మార్కెట్, డీఎస్ కాంప్లెక్స్, నిజామా బాద్‌ను నగరపాలక సంస్థగా అప్‌గ్రేడ్, నగరంలో భూగర్భ డ్రైనేజీ, ధర్మపురి హిల్స్‌లో పేదలకు ఇళ్ల స్థలాలు, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ప్రెస్‌క్లబ్, నగరంలో ఆర్‌వోబీ, 100 అడుగుల రోడ్డు నిర్మా ణం తదితర అభివృద్ధి పనులు చేయించారు.

- శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2 గంటల సమయంలో గుండెపోటు రావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.
- శనివారం ఉదయం 3:30 గంటల సమయంలో గుండెపోటు డి.శ్రీనివాస్ మృతి చెందారు.
- ఆస్పత్రి నుంచి హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గల డీఎస్ ఇంటికి పార్థీవ దేహాన్ని తరలించారు.
- మధ్యాహ్నం వరకు డీఎస్ పార్థీవదేహాన్ని కాంగ్రెస్ నేతల సందర్శనార్థం గాంధీభవన్‌లో మధ్యాహ్నం 2:00 గంటల వరకు తరలించారు.
- గాంధీ భవన్‌లో కాంగ్రెస్‌నాయకులు డీఎస్ భౌతికకాయంపై కాంగ్రెస్ జెండాను కప్పారు.
- సాయంత్రం 5 గంటలకు నిజామాబాద్‌కు భౌతికకాయాన్ని పంపించారు.
- సాయంత్రం 8:00 గంటలకు నిజామాబాద్‌లోని ప్రగతి నగర్‌లోని వారి నివాసంలో వారి భౌతికాయాన్ని ప్రజల సందర్శనార్థం అందుబాటులో ఉంచారు.
- ఆదివారం ఉదయం 11:00 గంటలకు అంతిమయాత్ర ప్రారంభం కానుంది.



మన్మోహన్‌సింగ్, సోనియా గాంధీతో డీఎస్



రాజీవ్ గాంధీతో మాట్లాడుతూ..



దివంగత సీఎం వైఎస్సార్‌తో..



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తూ..

అర్వింద్ భావోద్వేగం..



తండ్రి మరణం పట్ల ఎంపీ అర్వింద్ సోషల్ మీడియాలో ఎమోషనల్ మెసేజ్ చేశారు. 'అన్నా అంటే నేనున్నానని.. ఏ ఆపదలోనైనా ఆదుకునే శీనన్న ఇక లేరు, ఐ విల్‌మిస్ యూ డాడీ! నా తండ్రి, నా గురువు అన్నీ మా నాన్నే! ఎదురొడ్డు.. పోరాడు.. భయపడకు.. అని నేర్పింది మా నాన్నే.. ప్రజలను ప్రేమించు, ప్రజల కోసమే జీవించు అని చెప్పింది మా నాన్నే. నాన్నా..! నువ్వు ఎప్పటికీ నాతోనే ఉంటావు, ఎప్పటికీ నాతోనే ఉంటావు.' అని రాశారు.

ఒక శకం ముగిసింది



ఖలీల్‌వాడి: డి.శ్రీనివాస్ మరణంతో ఆయన కుమారుడు ధర్మపురి సంజయ్ భావోద్వేగానికి గురయ్యారు. తండ్రి మరణవార్త తెలియడంతో తెల్లవారు జామున వెంటనే నగరంలోని ప్రగతినగర్‌లో గల డీఎస్ నివాసానికి చేరుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నాన్న డీఎస్ మృతితో జిల్లా రాజకీయాల్లో ఒక శకం ముగిసిందని పేర్కొన్నారు.



డీఎస్ పార్థీవదేహం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, పక్కన ఎంపీ అర్వింద్ తదితరులు

డీఎస్ అంత్యక్రియలకు ఏర్పాట్లు

నిజామాబాద్‌రూరల్: పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి డి.శ్రీనివాస్ శనివారం ఉదయం హైదరాబాద్‌లోని తన నివాసంలో గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన అంతిమయాత్ర ఆదివారం మధ్యాహ్నం డీఎస్ స్వగృహం నుంచి ప్రారంభమవుతుంది. అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం మాధవనగర్ బైపాస్ వద్ద గల ధర్మపురి శ్రీనివాస్‌కు చెందిన ఆరెకరాల స్వస్థలంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అంతిమ సంస్కారాలు నిర్వహించనున్న ఈ స్థలాన్ని అదనపు కలెక్టర్ కిరణ్, ఆర్‌డీవో రాజేందర్, మున్సిపల్ కమిషనర్ మకరంద్, డిచ్‌పల్లి తహశీల్దార్ ప్రభాకర్‌తో కలిసి శనివారం పరిశీలించారు. డీఎస్ అంత్యక్రియలకు రాజకీయ ప్రముఖులు, పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. దీంతో ఇబ్బందులకు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.



డీఎస్ అంత్యక్రియల కోసం బైపాస్ రోడ్డులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ

జిల్లాతో డీఎస్‌కు అనుబంధం

- మంత్రిగా, పీసీసీ చీఫ్‌గా పలుమార్లు పర్యటన
- జిల్లా నేతలతో సన్నిహిత సంబంధాలు

సాక్షి, కామారెడ్డి: గుండెపోటుతో మరణించిన మాజీ పీసీసీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్‌కు జిల్లాతో అనుబంధం ఉంది. కాంగ్రెస్‌లో సుదీర్ఘకాలం వివిధ హోదాల్లో పనిచేసిన ఆయన.. మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా పలుమార్లు జిల్లాలో పర్యటించారు. బాన్సువాడకు చెందిన మాజీ ఎమ్మెల్సీ ఆర్.వెంకట్రాంరెడ్డి, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌గౌడ్, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాం, కామారెడ్డికి చెందిన మామిండ్ల అంజయ్య తదితరులతో సన్నిహిత సంబంధాలున్నాయి. జిల్లావ్యాప్తంగా ఆయనకు అభిమానులున్నారు. డీఎస్ మరణ వార్త తెలియగానే ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం హైదరాబాద్‌లోని డీఎస్ ఇంటికి వెళ్లి నివాళులర్పించారు.

డీఎస్‌తో కలిసి

1989లో నిజామాబాద్ ఎమ్మెల్యేగా డీఎస్ విజయం సాధించారు. అదే సమయంలో కామారెడ్డి నుంచి షబ్బీర్ అలీ గెలిచారు. ఉమ్మడి జిల్లా నుంచి ఈ ఇద్దరికీ మంత్రి వర్గంలో అవకాశం దక్కింది.



బాన్సువాడ సభలో మాజీ ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డితో డీఎస్

తర్వాత 2004 ఎన్నికల్లోనూ ఇద్దరు గెలిచి, దివంగత సీఎం వైఎస్సార్ మంత్రి వర్గంలో మంత్రులుగా పనిచేశారు. ఇద్దరు నేతలూ 2009 ఎన్నికల్లో ఓడిపోయారు.

రామాయంపేట పూరీ ఇష్టం

డీఎస్‌కు రామాయంపేట పూరీ అంటే చాలా ఇష్టం. ఆయన నిజామాబాద్ – హైదరాబాద్ మధ్య రాకపోకలు సాగించే సమయంలో తప్పనిసరిగా రామాయంపేటలోని అల్పేష్ హోటల్ వద్ద ఆగి, పూరీ తినేవారని ఆయన అనుచరులు చెబుతారు. మంత్రి హోదాలో ఉన్నప్పుడు వాహన శ్రేణి ఆపడం ఇబ్బందికరంగా ఉంటుందనే ఉద్దేశంతో ముందుగా సమాచారం అందించి హైవే మీదకు పార్సిల్ తెప్పించుకుని తినేవారు. మిగతా సమయాల్లో అయితే రెగ్యులర్‌గా రామాయంపేట పట్టణంలోని బస్టాండ్ ఎదుట ఉన్న అల్పేష్ హోటల్ వద్ద ఆగి కారులోనే కూర్చుని పూరీ ఇష్టంగా తిని వెళ్లేవారని చెబుతారు.

'ధరణి స్పెషల్ డ్రైవ్‌ను వేగవంతం చేయాలి'

కామారెడ్డి క్రైం: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను 10 రోజుల్లో పరిష్కరించాలని భూపరిపాలన విభాగం చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్ కలెక్టర్‌లను ఆదేశించారు. శనివారం ఆయన హైదరాబాద్‌లోని సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో ధరణి సమస్యల పరిష్కారంపై సమీక్షించారు. 15వ తేదీనుంచి ఇప్పటి వరకు ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై జిల్లాల వారీగా వివరాలను తెలుసుకున్నారు. ఆర్‌ఎస్‌ఆర్ లిమిట్, మిస్సింగ్ సర్వే నంబర్లు, సక్సెషన్, మ్యూటేషన్ తదితర సమస్యల పరిష్కారానికి అనుసరించాల్సిన పద్ధతులపై అధికారులకు సూచనలు ఇచ్చారు. రికార్డులు పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన తర్వాత సంబంధిత దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేస్తూ పరిష్కరించాలని సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం సమీకృత గురుకుల విద్యా సంస్థల ఏర్పాటుకు అనుకూలంగా ఉండేలా 20 ఎకరాల స్థలాన్ని గుర్తించాలన్నారు. వీసీలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవోలు రంగనాథ్‌రావు, ప్రభాకర్, రమేశ్ రాథోడ్, ఏవో మసూర్ అహ్మద్, పర్యవేక్షకులు ఉమలత, సరళ, స్వప్న పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్, జిల్లా అధికారులు

క్లుప్తంగా

డీఎస్ గొప్ప నాయకుడు

- హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

ఖలీల్‌వాడి: డీఎస్ గొప్ప నాయకుడని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆయన మృతిపై ఆయన సంతాపం తెలిపారు. కష్ట సమయాల్లో కూడా మంచి నిర్ణయాలు తీసుకునే శక్తి సామర్థ్యం ఉన్న నేత డీఎస్ అన్నారు. డీఎస్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. తాను రైల్వే శాఖ సహాయ మంత్రిగా నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవానికి వెళ్లినప్పుడు నిజామాబాద్ అభివృద్ధి కోసం సలహాలు, సూచనలు అందించారన్నారు. ఆయన మృతితో తెలంగాణ ఒక పాత తరం నాయకుడిని కోల్పోయిందని పేర్కొన్నారు.

జిల్లా ప్రజలకు తీరని లోటు



సుభాష్‌నగర్: మాజీ మంత్రి, పీసీసీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ మృతి తీరని లోటని ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. వారి ఆత్మ కు శాంతి కలగాలని, డీఎస్ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని ఆయన భగవంతుడిని కోరారు.

బాజిరెడ్డి సంతాపం



ఖలీల్‌వాడి: డీఎస్ మరణంపై మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సంతాపం తెలిపారు. జిల్లాకు, రాష్ట్రానికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

బాలు పాటలంటే ఇష్టం

ఖలీల్‌వాడి: డి శ్రీనివాస్ రాజకీయాల్లో బిజీగా ఉన్నా ఖాళీగా ఉన్నప్పుడు బాలు పాటలు వినేవారు. సంగీతంతో మానసిక ప్రశాంతత ఉంటుందని డీఎస్ సన్నిహితులకు చెప్పేవారు. అలాగే డీఎస్ మంచి భోజనప్రియుడు. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లేటప్పుడు ఉదయం పూట రామాయంపేట వద్ద పూరి తినేవారు.

అన్నదమ్ముల్లా ఉండేవాళ్లం



ఉమ్మడి జిల్లాలో మేమిద్దరం అన్నదమ్ముల్లా ఉండేవాళ్లం. ఇద్దరం కలిసి చాలా కాలం పనిచేశాం. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రెండు పర్యాయాలు అధికారంలోకి రావడంలో ఆయన పీసీసీ అధ్యక్షుడిగా కీలక భూమిక పోషించారు. ఆయన మరణం బాధాకరం. ఆయన ఆత్మకు శాంతి కలగాలి.

– షబ్బీర్ అలీ, ప్రభుత్వ సలహాదారు

మున్నూరుకాపులకు అండగా డీఎస్

- నిజామాబాద్ అర్బన్‌లో ఏకతాటిపైకి 21 సంఘాలు
- రెండు కల్యాణ మండపాల నిర్మాణం
- కుల సంఘాలకు నిధుల అందజేత

ఖలీల్‌వాడి: ధర్మపురి శ్రీనివాస్(డీఎస్) రాజకీయ అరంగేట్రం తర్వాత రాష్ట్రంతోపాటు ఉమ్మడి జిల్లాలో మున్నూరు కాపులకు సముచిత స్థానం కల్పించారు. నగరంలోని మున్నూరు సంఘాల నాయకులు కాపులు ఏకమై రాజకీయంగా అండగా ఉండే వ్యక్తి కోసం ఆరా తీశారు. అప్పటికే ఎన్ఎస్‌యూఐలో క్రియాశీలకంగా ఉన్న డీఎస్‌ను 1989లో ఎమ్మెల్యేగా పోటీ చేయించారు. ఆ ఎన్నికల్లో ఆయన గెలిచారు. అప్పటి నుంచి డీఎస్ జిల్లాతో పాటు నగరంలోని మున్నూరుకాపుల అభివృద్ధికి కృషి చేశారు. నగరంలో 16 గుర్తింపు ఉన్న మున్నూరుకాపు సంఘాలు ఉండగా ఐదు గుర్తింపు లేని సంఘాలు ఉన్నాయి. 21 సంఘాల్లో 120కి పైగా తర్పలు ఉన్నాయి. వీటిని డీఎస్ ఏకతాటిపైకి తెచ్చారు. నగరంలో ప్రగతినగర్, శివాజీనగర్ కుల సంఘాలకు ఫంక్షన్‌హాళ్లు నిర్మింపజేశారు. కులసంఘాల భవనాలకు నిధులు కేటాయించారు. మున్నూరుకాపు గుండెలలో డీఎస్ చిరస్థాయిగా నిలిచారు. డీఎస్ ప్రగతినగర్ మున్నూరుకాపు సంఘం అధ్యక్షులుగా ఉన్నారు.



ప్రగతినగర్ మున్నూరుకాపు కల్యాణ మండపం

సంఘాలను ఏకం చేశారు



నగరంలోని మున్నూరుకాపు సంఘాల పెద్ద మనుషులను ఒక వేదికపైకి తీసుకువచ్చింది డీఎస్సే. ఎమ్మెల్యే అయిన తర్వాత అన్ని సంఘాలతో సమావేశాలు నిర్వహించి సమస్యలను పరిష్కరించారు.

– సాయిలు, మున్నూరుకాపు సంఘం కార్యదర్శి, ప్రగతినగర్

డీఎస్ సలహాతోనే..



డీఎస్ సలహాతోనే జిల్లాలో వధువరుల పరిచయ వేదిక ఏర్పాటు చేశాం. డీఎస్ పుట్టిన రోజున మాజీ మేయర్ సంజయ్ పేదలకు పెండ్లిలు చేస్తారు.

– రామర్తి గంగాధర్, కన్వీనర్, మున్నూరుకాపు వధూవరుల పరిచయ వేదిక

కల్యాణ మండపాలు నిర్మించారు



మున్నూరు కాపుల పెళ్లిలు, వివిధ ఫంక్షన్‌ల కోసం డీఎస్ కల్యాణ మండపాలు నిర్మించారు. మున్నూరుకాపు సభ్యులకు తక్కువ రేటుకు ఇవ్వడం డీఎస్ చలువే.

– రాజేశ్వర్, సెక్రెటరీ, ప్రగతినగర్ కల్యాణ మండపం

తీర్మానం చేసి గెలిపించాయి



డీఎస్ మున్నూరుకాపుల గురించి ఆలోచించేవారు. అప్పటి పరిస్థితుల బట్టి డీఎస్‌ను అన్ని కులసంఘాలు తీర్మానం చేసుకొని నిజామాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిపించాయి.

– వెంకటేశం, మున్నూరుకాపు సంఘం ఉపాధ్యక్షుడు

కుల సంఘాలకు సహకారం



శివాజీనగర్‌లోని కల్యాణ మండపానికి రెండున్నర ఎకరాల భూమి డీఎస్ ద్వారా వచ్చింది. డీఎస్ కులసంఘాల బలోపేతానికి సహకారం అందించారు. ఆయన మా మనస్సులో ఉంటారు.

– గాండ్ల లింగం, శివాజీనగర్ మాజీ అధ్యక్షుడు

డీఎస్ మృతి తీరని లోటు

ఖలీల్‌వాడి: డీఎస్ మృతి జిల్లాకు తీరని లోటని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆయన ప్రోత్సాహం, సహకారంతో ఎంతోమంది కాంగ్రెస్‌లో పదవులు పొందారు. డీఎస్ ఎల్లప్పుడు కార్యకర్తలకు అండగా ఉండేవారని పలువురు నాయకులు గుర్తు చేసుకున్నారు.

డీఎస్‌తోనే రాజకీయాల్లోకి వచ్చా



ధర్మపురి శ్రీనివాస్‌తోనే నేను రాజకీయాల్లోకి వచ్చాను. ఆయన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు అండగా నిలిచి ఎలాంటి సమస్యను తీసుకువెళ్లిన పరిష్కరించేవారు.

– కేశ వేణు, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, నిజామాబాద్

అభివృద్ధికి సహకరించారు



డీఎస్ నా రాజకీయ గురువు. ఆయన సహకారంతో బాడ్సి సర్పంచ్‌గా గెలుపొందాను. డీఎస్ ఇచ్చిన నిధులతో గ్రామాభివృద్ధి చేశాను. సర్పంచ్ నుంచి పీసీసీ కార్యవర్గ సభ్యుడిగా ఎదగడం డీఎస్ చలువే.

– బాడ్సి శేఖర్‌గౌడ్, పీసీసీ కార్యవర్గ సభ్యుడు

ముఖ్య అనుచరుడిని..



నిజామాబాద్ రూరల్ మండలంలో డీఎస్ ముఖ్య అనుచరులలో నేను ఒకడిని. డీఎస్‌తోనే జిల్లా రాజకీయాల్లో నాకు స్థానం లభించింది. డీఎస్ ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు గౌరవం ఇస్తారు.వీరు ఎక్కువ తక్కువ అని చూసేవారు కాదు.

– గంగారెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు, నిజామాబాద్

కార్యకర్తగా గుర్తింపు



డీఎస్ వద్ద కార్యకర్తగా మంచి గుర్తింపు ఉండేది. కార్యకర్తలను కూడా ఎంత మంది ఉన్న పేరు పెట్టి పిలిచేవారు. అలాంటి నేత మా నుంచి దూరం కావడం దరదృష్టం.

– దయాకర్‌గౌడ్, కాంగ్రెస్ లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు, నిజామాబాద్

జిల్లాకు తీరని లోటు



డి శ్రీనివాస్ మృతి జిల్లా కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి. కాంగ్రెస్‌లో అత్యున్నత పదవులు అలంకరించి ప్రజాసేవకు ఎల్లప్పుడూ కృషి చేసిన వ్యక్తి డీఎస్.

– మానాల మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు

సముచిత స్థానం కల్పించారు



ఎన్ఎస్‌యూఐలో క్రియాశీలకంగా ఉండటంతో కాంగ్రెస్ పార్టీలో డీఎస్ నాకు సముచిత అవకాశం కల్పించారు. ఆయన నా రాజకీయ గురువు. డీఎస్ ద్వారా ఉమ్మడి జిల్లాలో 9 ఏండ్లు డీసీసీ అధ్యక్షుడిగా పని చేశా. ఆయన లేని లోటు వ్యక్తిగతంగా, పార్టీ పరంగా తీరని లోటు. డీఎస్ మృతిపై వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి.

– గడుగు గంగాధర్, పీసీసీ కార్యదర్శి, నిజామాబాద్

గురువు ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి..

- అర్గుల్ రాజారాం వద్ద శిష్యరికం చేసి ఎదిగిన డీఎస్
- బ్యాంకులో క్లర్క్ ఉద్యోగం వదిలి ప్రత్యక్ష రాజకీయాల్లోకి..



అర్గుల్ రాజారాం

ఆర్మూర్: బడుగు, బలహీనవర్గాల నాయకుడిగా ప్రజల మనస్సుల్లో నిలిచిన అర్గుల్ రాజారాం శిష్యుడిగా ధర్మపురి శ్రీనివాస్ రాజకీయాల్లో రాణించారు. ఆయన సైతం బీసీ నాయకుడిగా గుర్తింపు పొందారు. కాంగ్రెస్ అగ్రనాయకుడిగా, మంత్రిగా, తెలంగాణ ఉద్యమకారునిగా ప్రజల్లో ఉన్న అర్గుల్ రాజారాంను స్ఫూర్తిగా తీసుకొని ఎంతో మంది నాడు రాజకీయాల్లోకి వచ్చారు. అలా వచ్చిన వారిలో ధర్మపురి శ్రీనివాస్‌తోపాటు శనిగరం సంతోష్‌రెడ్డి ఉన్నారు. 1980కి ముందు డీ.శ్రీనివాస్ రిజర్వ్ బ్యాంకులో క్లర్క్‌గా(హైదరాబాద్) పని చేశారు. తన ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చిన డీఎస్ మొదటిసారి ఎమ్మెల్సీగా పోటీ చేసి పీసీసీ గంగారెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. 1983 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి డి సత్యనారాయణ చేతిలో ఓటమి పాలైన డీఎస్.. 1989లో నిజామాబాద్ స్థానం నుంచి విజయం సాధించారు. ఆ తరువాత 1999, 2004 ఎన్నికల్లోనూ విజయం సాధించారు. అర్గుల్ రాజారాంకు శిష్యునిగా డీఎస్ రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీలపాత్ర పోషించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండు పర్యాయాలు పీసీసీ అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించి 2004, 2009లో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి డీఎస్ కృషి చేశారు. తన రాజకీయ గురువైన అర్గుల్ రాజారాంను డీఎస్ సభా వేదికలపై స్మరించుకునేవారు. అర్గుల్ రాజారాం శిష్యుడిగా కొనసాగడంతోపాటు ఆయన కుటుంబంతో బంధుత్వం కూడా ఉండటం డి శ్రీనివాస్‌కు రాజకీయంగా కలిసి వచ్చాయి.

40 ఏళ్ల రాజకీయ అనుబంధం



ఖలీల్‌వాడి: డీఎస్ మరణ వార్త దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయనతో నాకు 40 ఏళ్లుగా రాజకీయ అనుబంధం ఉంది. 1985లో జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా నియామకానికి వెన్నుదన్నుగా నిలిచి ప్రత్యక్ష రాజకీయాలకు అడుగులు వేయించిన నేత డీఎస్. ఉమ్మడి రాష్ట్రంలో ఒక బీసీ నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి డి.శ్రీనివాస్. డీఎస్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని వేడుకుంటున్నాను.

– మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

ఎమ్మెల్యే పోచారం సంతాపం



సీనియర్ రాజకీయ నేత, మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు డీఎస్ మరణంపై మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సంతాపం తెలిపారు. హైదరాబాద్‌లో డి.శ్రీనివాస్ ఇంట్లో ఆయన పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఎస్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

నా రాజకీయ గురువు



ఖలీల్‌వాడి: డి శ్రీనివాస్ మృతిపై టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ సంతాపం వ్యక్తం చేశారు. బంజారాహిల్స్‌లోని డి.శ్రీనివాస్ ఇంట్లో ఆయన పార్థీవదేహానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. డీఎస్ తనకు రాజకీయ గురువుని, మెంటర్‌గా తనని రాజకీయంగా ఎంతో ప్రోత్సహించారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడిగా పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి డి.శ్రీనివాస్ ఎంతో శ్రమించారన్నారు. అధిష్టానానికి, ప్రత్యేకంగా సోనియా గాంధీ కుటుంబానికి అత్యంత సన్నితుడిగా ఉండేవారన్నారు. తెలంగాణ ఏర్పాటులోనూ ఆయన కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. అనివార్య కారణాలతో ఇతర పార్టీలోకి వెళ్లి వచ్చినప్పటికీ, తన చివరి శ్వాస వరకు కాంగ్రెస్ జెండాతోనే ఉంటానని, చనిపోయాక తనపై కాంగ్రెస్ జెండానే ఉండాలని డీఎస్ చెప్పిన మాటను గుర్తు చేశారు.

డీఎస్‌కు ఘన నివాళి



డీఎస్ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తదితరులు

మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ మృతదేహానికి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు నివాళులు అర్పించారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.



ఎంపీ అర్వింద్‌ను ఓదారుస్తున్న గడుగు గంగాధర్



డీఎస్ మృతదేహం వద్ద కాంగ్రెస్, బీజేపీ నాయకులు



నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత



కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశ వేణు



అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ గుప్తా



భైంసా ఎమ్మెల్యే రామారావు పటేల్



వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి



డీఎస్ ఇంటి వద్ద నాయకులు, కార్యకర్తలు

స్వగ్రామ అభివృద్ధికి డీఎస్ పెద్దపీట

వేల్పూర్: ధర్మపురి శ్రీనివాస్ తన స్వగ్రామమైన వేల్పూర్ అభివృద్ధికి పెద్దపీట వేశారు. గ్రామాభివృద్ధికి సాధ్యమైనన్ని నిధులు కేటాయింపజేశారు. రెండుసార్లు మంత్రిగా ఉన్నప్పుడు గ్రామస్తులు అడిగింది కాదనకుండా మంజూరు చేయించారు. డీఎస్ జన్మించిన కొన్నాళ్లకే ఆయన తండ్రి వ్యాపార రీత్యా ముంబాయికి వెళ్లడంతో డీఎస్ ప్రాథమిక విద్యాభ్యాసం అక్కడే సాగింది. ఉన్నత విద్యాభ్యాసం హైదరాబాద్‌లో చదివారు. రాజకీయాల్లో చేరి నిజామాబాద్ ఎమ్మెల్యేగా, ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా ఉంటూ తన సొంత గ్రామమైన వేల్పూర్ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. అంజయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 63 నంబరు జాతీయ రహదారి నుంచి వేల్పూర్ దాకా తారు రోడ్డు వేయించారు. అర్గుల్ రాజారాం మంత్రిగా ఉన్నప్పుడు అయనతో మాట్లాడి గ్రామంలో ఎస్‌బీహెచ్ ఏర్పాటు చేయించారు. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం నిర్మింపజేశారు. తన ఇంటిని గ్రామస్తుల ఉపయోగం కోసం వితరణ చేస్తానని హామీ ఇవ్వగా, కుటుంబ సభ్యులు ఒప్పుకోకపోవడంతో దానికి బదులుగా మండల పరిషత్ కార్యాలయం నిర్మాణానికి అవసరమైన అర ఎకరం భూమిని కొనుగోలు చేసి ఇచ్చారు. మంత్రిగా ఉన్నప్పుడు వేల్పూర్‌లో సీసీ రోడ్లు నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేయించారు. ఇదే సమయంలో పసుపు ప్రత్యేక పథకం ఏర్పాటు కోసం ఏడు ఎకరాల భూమికి రూ.14 లక్షల ప్రభుత్వ నిధులు వెచ్చించారు.



వేల్పూర్‌లో డీఎస్ చిన్నప్పుడు నివసించిన ఇల్లు

దామన్న అని పిలుస్తుండే



ధర్మపురి శ్రీనివాస్ నాకన్నా పదేళ్ల చిన్నవాడు. గ్రామంలో పిలిచే వరసకు బామ్మరిది అవుతాడు. కానీ దామన్న అనేవాడు. 2004 నుంచి ఆయన మంత్రిగా ఉన్నప్పుడు వేల్పూర్‌కు నేను సర్పంచ్‌గా ఉన్నాను. మేము అడిగిన వెంటనే రూ.5 కోట్లతో గ్రామానికి సీసీరోడ్లు, 14 ఎకరాల్లో ఇందిరమ్మ ఇళ్లస్థలాలు మంజూరు చేయించారు.

– పిల్లమారి దామోదర్, మాజీ సర్పంచ్, వేల్పూర్

కలిసి మెలిసి ఉండేవాళ్లం



డీఎస్ వాళ్ల ఇల్లు, మా ఇల్లు పక్కపక్కనే ఉండేవి. చిన్నప్పుడు కలిసి మెలిసి ఉండేవాళ్లం. గ్రామస్తులు ఆయన దగ్గరికి వెళ్లి అడిగిందే తడువుగా పనులు చేయించేవారు. హైదరాబాద్ వెళ్లినపుడు చాలా మర్యాదగా చూసుకుంటుండే. ఇంతదూరం ఎందుకు రావడం, నిజామాబాద్ వచ్చినపుడు కలిస్తే అయిపోతది అని చెబుతుండే.

– తీగెల సాయిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్, వేల్పూర్

క్రైం కార్నర్

కరెంట్ షాక్‌తో యువకుడి మృతి



పవన్ మృతదేహం

బోధన్‌టౌన్: బోధన్‌లోని రాకాసీపేట్ కాలనీలో విద్యుత్ షాక్‌తో శనివారం యువకుడు మృతి చెందాడు. బెల్లాల్ గ్రామానికి చెందిన పవన్(24) రాకాసీపేట్‌లో ఇంటి నిర్మాణానికి కూలీ పనికి వచ్చాడు. ఇనుప రాడ్ తీసుకొని వస్తుండగా అది విద్యుత్ తీగలకు తగలడంతో షాక్ కొట్టి కింద పడ్డారు. వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడని సీఐ వీరయ్య తెలిపారు. మృతుడి తల్లి అబ్బవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..



నర్సింలు(ఫైల్)

లింగంపేట: మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన పెండ నర్సింలు(34) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. నర్సింలు మూడు నెలల క్రితం బతుకుదెరువు కోసం హైదరాబాదుకు వెళ్లాడు. శనివారం హైదరాబాద్‌లో మృతి చెందినట్లు గ్రామస్తులకు సమాచారం అందింది. నర్సింలు ఆయన భార్య హతమార్చినట్లు గ్రామస్తులు అనుమానిస్తున్నారు.

కొడుకును హతమార్చిన తండ్రి

ఎల్లారెడ్డి: భూతగాదా విషయంలో కొడుకును తండ్రి హతమార్చిన ఘటన ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసానిపేట గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన కొడిపాక సాయిలు (40)కు తండ్రి వెంకటేశంతో భూమి పంపిణీ విషయంలో గత కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో కొడుకుపై కసి పెంచుకున్న వెంకటేశం శుక్రవారం ఇంటి ఆవరణలో పడుకున్న సాయిలు మెడ, తలపై కర్రతో దాడి చేసి, గొంతు నులిమి హత్య చేశాడు. సాయిలు మృతి చెందాడని నిర్ధారించుకున్న అనంతరం మృతదేహాన్ని ఈడ్చుకుని పోయి పోచారం కాలువ మెట్ల వద్ద పడేసి పక్కన మందు సీసాలు పెట్టి మద్యం సేవించి మృతి చెందినట్లు చిత్రీకరించాడు. మృతుడి భార్య అనసూయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. ఘటన స్థలాన్ని డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్‌నాయక్ పరిశీలించారు.



సాయిలు (ఫైల్)



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్య

వర్ని: యువకుడి వేధింపులు తాళలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతకుంట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణకుమార్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన యువతి(19)ని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన యువకుడు తరుచు వేధిస్తున్నాడు. వేధింపులు తాళలేక ఆమె శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడు..

కామారెడ్డి క్రైం: రైలు కింద పడి ఓ గుర్తు తెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డిలోని హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. రైలు పట్టాలపై ఓ మృతదేహం పడి ఉందని సమాచారం రావడంతో కామారెడ్డి రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుని వయస్సు 60–65 మధ్య ఉండవచ్చని భావిస్తున్నారు. గుర్తు తెలియని రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్యకు పాల్పడినట్లుగా తెలుస్తుందని రైల్వే ఎస్సై తావూనాయక్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

మనస్తాపంతో ఒకరు..

బోధన్‌టౌన్: బోధన్‌లోని రాకాసీపేట్ కాలనీకి చెందిన గందం గంగాధర్(40) శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. కాలనీకి చెందిన గంగాధర్ మద్యానికి బానిసయ్యాడు. రోజు భార్య భర్తల మధ్య గొడవలు జరిగేవి. కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై మనస్తాపం చెందిన గంగాధర్ శుక్రవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.